క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



పెనమలూరు: పెదపులిపాకలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడికి పార్టీ ఆర్థిక సాయం అందించింది. గ్రామానికి చెందిన పార్టీ నేత బోడా అంకయ్య అనారోగ్యంతో ఉండటంతో ఆయన వైద్య ఖర్చులకు వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రూ. 10 వేలు ఆర్థిక సాయం ఇవ్వగా పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మండూరు కోటేశ్వరరావు, మైనార్టీ నాయకుడు అష్రఫ్, గ్రామ నేతలు ఎం వెంకటేశ్వరరావు, డాక్టర్ కే అర్జున్‌రావు, చంటి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కంకిపాడు: కార్యకర్తలకు, వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కంకిపాడు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు ఎండీ అన్సర్ తండ్రి ఎండీ షరీఫ్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. షరీఫ్ భౌతిక కాయానికి చక్రవర్తి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, నాయకులు తంబాబత్తుల ఓంకారం, కరీముల్లా, మల్లు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి అభిషేకాలు



దావాజిగూడెం (గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఉపాలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి 109 కలశల గోక్షీరం, పంచామృతాలు, 27 రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం 41 కేజీల చందనంతో స్వామివారిని అలంకరించారు. ఆలయ అర్చకులు ఎస్ రామాచార్యులు నేతృత్వంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీసీతారామ దాసాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

పెనమలూరు: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. ట్రాఫిక్ కానిస్టేబుల్ యు.సోమశేఖర్ ఏపీ ఈఏపీసెట్ పరీక్షల సందర్భంగా కానూరు అయాన్ డిజిటల్ సెంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆటోలో వచ్చిన వ్యక్తులు ఆటోను రోడ్డుపై అడ్డుపెట్టారు. ఆటో తీయాలని అందులో ఉన్న వ్యక్తులకు కానిస్టేబుల్ చెప్పాడు. దీంతో ఆటోలో ఉన్న గొల్లపూడికి చెందిన అబ్దుల్ హఫీజ్, అబ్దుల్ అల్తాఫ్ ఆగ్రహంతో విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మురుగు కాలువ గోడు పట్టదా..?

- గుర్రపుడెక్క, తూడుతో అధ్వానం
- మంతెన వద్ద ప్రమాదకరంగా వంతెన
- అభివృద్ధి కోసం ఎదురుచూపులు



మురుగుకాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క



మంతెన వద్ద ఇరువైపులా శిథిలమైన గోడలతో ప్రమాదకరంగా వంతెన

కంకిపాడు: మురుగుకాలువ గోడు పట్టడం లేదు. కేవలం మురుగు పారుదలే కదా అని నిర్లక్ష్యం చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో పొలాల్లో మురుగు మళ్లించేందుకు ఉన్న ఏకైక మార్గం ఈ మురుగు కాలువ ఒక్కటే. కాలువలో పూడికతీత, వ్యర్థాల తొలగింపులు చేపట్టకపోవడంతో మురుగు పారుదల ప్రశ్నార్థకంగా తయారైంది. మంతెన వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరువ కావడంతో రాకపోకలు సైతం ప్రమాదకరంగా మారాయి.

మురుగు పోయే మార్గం ఇదే

పెనమలూరు మండలం గంగూరు నుంచి మురుగుతో వచ్చే మురుగుకాలువ ఈడుపుగల్లు మీదుగా ఉప్పలూరు వంతెన వద్ద యూటీగా(అండర్ టెన్నెల్) వచ్చి ఉప్పలూరు, మంతెన మీదుగా బుడమేరులో కలుస్తుంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వ్యర్థాలతో కాలువ ప్రవహిస్తుంది. అంతేకాకుండా అధిక వర్షాలు పడే సమయంలో పొలాల్లో ఉన్న మురుగు రైతులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మురుగు కాలువలోకి మళ్లించి పంటలను సంరక్షించుకుంటున్న పరిస్థితి.

ప్రశ్నార్థకంగా మురుగు పారుదల

మురుగు కాలువ దారి పొడవునా తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి అధ్వానంగా మారింది. వ్యర్థాలు పేరుకుని మురుగు పారుదల ప్రశ్నార్థకంగా తయారైంది. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి మురుగు కాలువలో పూడిక తీత, గుర్రపుడెక్క, తూడు తొలగింపులు చేపడితే పొలాల్లో వచ్చే మురుగు నేరుగా మురుగు కాలువలోకి మళ్లించి పొలాలను కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని స్థానిక రైతులు సూచిస్తున్నారు.

శిథిలావస్థలో వంతెన

వాహనాల రాకపోకలకు వీలుగా మురుగు కాలువపై మంతెన వద్ద వంతెన దశాబ్దాల క్రితం వంతెన నిర్మించారు. ఈ వంతెన మీదుగా ఉప్పలూరు - మంతెన మార్గం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి రైతులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు, వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకోవడానికి ఇదే ప్రధాన మార్గం. అంతేకాకుండా విజయవాడ, కంకిపాడు ప్రాంతాలకు చేరుకోవడానికి కూడా ఇక్కడి ప్రజలు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. అయితే ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలమయ్యాయి. వంతెన మీదుగా ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూటమి ప్రభుత్వం గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక



పెనమలూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

దేవదాయ భూముల కౌలు వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని దేవదాయశాఖకు చెందిన వ్యవసాయ భూముల కౌలు వేలం బుధవారం శ్రీకాశీవిశ్వేశ్వరస్వామివారి దేవస్థానంలో అధికారులు నిర్వహించారు. మూడేళ్లకుగానూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన 11.12 ఎకరాలు, శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 7.59 ఎకరాలు, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన 31/2 సర్వే నెంబరులోని 7.98 ఎకరాలు, సర్వే నెంబరు 346లో 8.74 ఎకరాల భూములకు వేలం పాట నిర్వహించారు. కౌలు వేలం పాటలో దేవదాయశాఖ తనిఖీ అధికారి సుజన్, ఈఓ ఎస్ హేమలతాదేవి, అర్చకులు డాక్టర్ ఎం.ఫణికుమార్, సిబ్బంది సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్లపైకి చేరిన మురుగునీరు



కానూరులో రోడ్లపై డ్రెయినేజీ నీరు



మహదేవపురం కాలనీ వద్ద మునిగిన ప్రాంతం

కానూరు గ్రామంలో బుధవారం పడిన తేలికపాటి వర్షానికే మహదేవపురం, వృద్ధాశ్రమం, 80 అడుగుల రోడ్డు, సనత్‌నగర్‌లలో మురుగు నీరుతో రోడ్లు జలమయమయ్యాయి. స్థానిక ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేని విధంగా మురుగునీరు రోడ్లుపైకి రావడంతో పరిస్థితులు దారుణంగా మారాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహించడమే కాకుండా అపార్టుమెంట్లలోకి కూడా చేరుతున్నాయి. – పెనమలూరు



అపార్టుమెంట్‌లోకి వచ్చిన మురుగునీరు

గంజాయి విక్రేత అరెస్టు

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం .. కాకినాడ జిల్లా తుని మండలం మల్లవరం గ్రామానికి చెందిన అల్లు కార్తీక్ విశాఖపట్నం ప్రాంతంలో గంజాయి కొని విజయవాడ ప్రాంతంలో విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన భానుప్రకాష్, మణికంఠ ద్వారా గంజాయి విక్రయించడానికి నగరానికి వచ్చాడు. అయితే పై వ్యక్తులు అల్లు కార్తీక్‌ను కానూరు రమ్మని చెప్పారు. దీంతో కార్తీక్ కానూరు వచ్చి నిరీక్షిస్తున్న సమయంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు కార్తీక్‌ను అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుంచి 2.80 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు. మిగితా ఇద్దరి వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వల్లభనేని వంశీ త్వరగా కోలుకోవాలని పూజలు



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంశీమోహన్‌పై కక్ష కట్టి అక్రమ కేసులు బనాయించి గత వంద రోజులకుపైగా జైలులో పెట్టిందన్నారు. అనేక కేసుల్లో వంశీమోహన్‌కు కోర్టులు బెయిల్ మంజూరు చేసినప్పటికీ కొత్తగా తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వంశీమోహన్‌కు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరివీధి రవి, వార్డు సభ్యురాలు రత్నమాల, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

పెనమలూరు: పుస్తక పఠనంతోనే విజ్ఞానం వస్తుందని వణుకూరు గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో భాగంగా వణుకూరు గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానం కలిగించే పుస్తకలు చదవాలని సూచించారు. కాగా విద్యార్థులతో తోక కథలు చెప్పించి, కోకో ఆటల పోటీలు నిర్వహించారు.

మొక్కలు నాటిన చిన్నారులు

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరులో బుధవారం టీన్ మిషన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టీన్ మిషన్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ పులిపాక సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు 1984 నుంచి ఇప్పటి వరకు కొన్ని వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. పలువురు టీన్ మిషన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడు: తెన్నేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు పఠనంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రంథాలయాధికారి ఎస్ సునీత ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సహించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు, క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. చెస్, కారమ్స్, లూడో ఆటలతోపాటు పుస్తకాలు చదవడం, కథలు చెప్పించడం నిర్వహించి విజేతలను అభినందించారు. సీనియర్ సిటిజన్ శేషగిరిరావు, పాఠకులు పాల్గొన్నారు.



తెన్నేరు గ్రంథాలయంలో భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న చిన్నారులు



వణుకూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆలయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

దుర్గగుడి ఈవో శీనానాయక్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చేతి సంచులను వినియోగంలోకి తీసుకురావాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, రావిచెట్టు వద్ద పూజా సామగ్రిని ఆయన పరిశీలించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో పెద్ద సంఖ్యలో ఖాళీ వాటర్ బాటిల్స్ ఉండటాన్ని గమనించి.. శానిటేషన్ సిబ్బంది క్యూలైన్లను శుభ్రం చేసే తరుణంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను తొలగించాలని సూచించారు. అదేవిధంగా అమ్మవారికి సమర్పించే పూజా సామగ్రిని సైతం భక్తులు ప్లాస్టిక్ కవర్లలో తీసుకువస్తున్నారని, కొండ దిగువున పూజా సామగ్రి విక్రయించే వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండపై ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు భక్తులు, వ్యాపారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. దేవస్థానంలో తడిచెత్త, పొడి చెత్తను వేరు చేస్తున్న విధానాన్ని గమనించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దేవస్థానం భక్తులకు విక్రయిస్తున్న దర్శన టికెట్లను పరిశీలించారు.

నేడు హనుమజ్జయంతి మహోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామివారి ఆలయంలో హనుమజ్జయంతి మహోత్సవం, అర్ధ మండల పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయంలో హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలు గురువారం ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 11 గంటలకు అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆలయాలు ముస్తాబు

కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లోని రామాలయాలు, వైష్ణవ, ఆంజనేయస్వామి దేవస్థానాల్లో గురువారం హనుమజ్జయంతి నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రొద్దుటూరు రామాలయం, మద్దూరు కరకట్ట వెంబడి ఆంజనేయస్వామి దేవస్థానం, చలివేంద్రపాలెంలో వేంచేసిన శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఉపాధి కోసం రుణాలు మంజూరు

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరహరనాథ్

పెనమలూరు: స్వయం సహాయ సభ్యులకు ఉపాధి కోసం రుణాలు మంజూరు చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై హరహరనాథ్ తెలిపారు. పెదపులిపాక గ్రామంలో గ్రామ సంఘం ఆధ్వర్యాన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సూక్ష్మరుణాల ప్రణాళికల కోసం సర్వే చేయించి కొత్తగా చేపట్టబోయే వ్యాపారాలకు రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రుణాలు కావల్సిన సభ్యులు సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సభ్యులు ఏ వ్యాపారం చేస్తారో ముందుగా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. వ్యాపారాలు చేసే సభ్యులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని స్వయం సహాయ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీ కేపీ నాయక్, ఏపీఎం జీ కృష్ణంరాజు, సీసీ వీ నాగమణి, సీహెచ్ ఝాన్సీ, సభ్యులు పాల్గొన్నారు.



సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.హరహరనాథ్